సాక్షి
ఒడిశా

సోమవారం। 1। మే। 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.8,46,284లు, బంగారం 38 గ్రాములు, వెండి 234.7 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



రాష్ట్రంలో నార్కో పరీక్షలకు సన్నాహాలు

- 8లో



ముగిసిన బీకేఎంయూ సమ్మేళనం

- 8లో

న్యూస్‌రీల్

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో అతిథులు, దళిత నాయకులు

రాయగడ: జిల్లాలోని జేకే పూర్ సమీపంలోని అమలాభట్ట కూడలిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వాటర్‌షెడ్ డైరెక్టర్ దయానిధి బాగ్ ముఖ్య, రాష్ట్రమాజీ మంత్రి లాల్‌బిహారి హిమిరిక, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ హాజరయ్యారు. అంతకుముందు దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని, అమలాభట్ట నుంచి జేకేపూర్ వరకు ర్యాలీ నిర్వహించారు. జైభీమ్ సమాజ్ అధ్యక్షుడు అభి పలక, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ సమాజ్ అధ్యక్షుడు గంగాధర పువ్వల పర్యవేక్షించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



వినియోగదారుల హక్కులపై మాట్లాడుతున్న లోకనాథం

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ సమితి కేంద్రంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణపై కమిటీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత మిశ్రా ఆధ్వర్యంలో అవగాహన సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాటా సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్(టీపీఎస్‌ఓడీఎల్) ప్రీపెయిడ్ స్మార్ట్‌విద్యుత్ మీటర్లు తీసుకోవద్దని వినియోగదారులకు సూచించారు. ప్రతి వ్యాపారవేత్త విధిగా దుకాణాల వద్ద ధరల పట్టికను ప్రదర్శించాలని, దివ్యాంగులు, వృద్ధాప్యంతో బ్యాంకుకు వెళ్లలేకపోయిన వారికి ప్రభుత్వం ఇంటి వద్దకే పింఛన్ అందించాలని కోరారు. సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షురాలు తనూజా శత్పతి, సహాయ కార్యదర్శి లింగరాజ్ పాణిగ్రాహి, కార్యదర్శి రొక్కం లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతదేహం లభ్యం



వృద్ధురాలి మృతదేహం గుర్తించిన అపార్టమెంట్

భువనేశ్వర్: నగరంలోని నయాపల్లి ఎన్-2 అపార్టమెంట్‌లో తలుపులు మూసి ఉన్న అపార్టమెంట్‌లో వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. దీంతో ఇంటి తలుపులు విరగ్గొట్టిన కమిషనరేట్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు రాజశ్రీ పరిడా(75)గా గుర్తించారు. ఇదే ఫ్లాటులో మరో గదిలో ఆమె కుమారుడిని పోలీసులు గుర్తించారు. ఆయన మానసిక స్థిమితం లేనివాడిగా భావిస్తున్నారు. ఫ్లాట్ నుంచి దుర్గంధం వ్యాపించడంతో ఇరుగు-పొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు నయాపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. పరిసరాలను పరిశీలించిన మేరకు ఇంటి తలుపులు విరగ్గొట్టి, చొరబడేందుకు నిర్ణయించారు. ఈ చర్యతో లోపల దుర్గంధభరిత వృద్ధ మహిళ మృతదేహం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై విచారణ ప్రారంభించారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



పుల్‌మతి మృతదేహం

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సెరిగుమ్మ పంచాయతీలోని లంబేరి గ్రామంలో శనివారం సాయంత్రం పిడుగుపాటుకి ఓ మహిళ మృతి చెందింది. మృతురాలు అదే గ్రామానికి చెందిన పుల్‌మతి మండిక(31)గా గుర్తించారు. ఎప్పటిలాగే గ్రామానికి సమీపంలోని పొలంలో పనులకు వెళ్లిన ఆమె.. సాయంత్రం వరకు పనుల్లో నిమగ్నమైంది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగు సరాసరి ఆమెపై పడటంతో అక్కడిక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని గ్రామానికి తరలించారు.

షూటింగ్‌కు.. సై



- రాయగడ పరిసరాల్లో టెలీఫిల్మ్‌ల నిర్మాణానికి సన్నాహాలు
- తరంగ్ నిర్మాణంలో దర్శకత్వం వహించనున్న రిషబ్ అగ్రవాల్
- ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలే ఇతివృత్తంగా చిత్రీకరణ
- కోదండ రామాలయంలో ముహూర్తపు షాట్ పూర్తి



కోదండ రామమందిరంలో పూజలు చేస్తున్న చిత్రబృందం

రాయగడ: ప్రకృతికి నిలయమైన రాయగడ పరిసర ప్రాంతాల్లో ఒడియా భాషలో రెండు టెలీఫిల్మ్‌ల నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు నిర్మాణ సంస్థ స్థానిక బ్రాహ్మణ వీధిలోని కోదండ రామమందిరంలో ఆదివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఒడియా లఘుచిత్రాల నిర్మాత ఆర్.రాజు ముహూర్తపు షాట్‌తో పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఒడియా టెలీఛానెల్ తరంగ్ ప్రొడక్షన్‌లో రూపుదిద్దుకోనున్న రెండు టెలిఫిల్మ్ ముంబాయికి చెందిన ప్రముఖ కళాకారుడు రిషబ్ అగ్రవాల్ దర్శకత్వం వహించనున్నారు. ఆగ్నేయ, కాళీ పేరిట నిర్మించనున్న ఈ ఫిల్మ్‌లలో ఒలీవుడ్ నటి ఆర్లిన్ మిశ్రా, హీరోయిన్ మనోజ్‌మిశ్రా నటించనున్నట్లు దర్శకుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన హీరోను ప్రేక్షకులకు పరిచయం చేయగా, హీరోయిన్ ఆర్లిన్ తోపాటు సీనియర్ నటి ఉషాశ్రీ మిశ్రో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ రెండు చిత్రాల్లో శక్తిబరాల్, రింకు రాజ్‌గురు, కాళీరావు, నిషేర్ మిశ్రోతో పాటు స్థానిక కళాకారులు పిల్లల శంకరరావు, కాళీప్రసాద్ రథొ నటించనున్నారు.

రాయగడ పరిసరాల్లో చిత్రీకరణ..

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయం, వారి ఆచార వ్యవహారాలతో కూడిన ఇతివృత్తంతో ఆగ్నేయ చిత్రాన్ని నిర్మించనున్నట్లు దర్శకులు రిషబ్ ఈ సందర్భంగా విలేకర్లకు తెలియజేశారు. దివ్యాంగులైన ఆదివాసీ యువతీ, యువకుల మధ్య ప్రేమ, పెళ్లికి పెద్దలు ఏవిధంగా స్పందిస్తారు? కథతో ఈ చిత్రం రూపొందుతుందని.. దీనికి అనుగుణంగా రాయగడ పరిసర ప్రాంతాలైన కొందొకిలుము, తడమ, నతమ, హతీపథర్, రాయగడలో జేఎస్‌కో, చాటికోన బిసంకటక్ వంటి ప్రాంతాలను ఇప్పటికే ఎంపిక చేశామన్నారు. త్వరలో చిత్రీకరణ ప్రారంభిస్తామన్నారు. ఇదేతరహా మరో చిత్రం కాళీ కూడా ఆదివాసీలకు సంబంధించిన కథా నేపథ్యమని పేర్కొన్నారు. దాదాపు 2నెలల్లో ఈ రెండు చిత్రాలను ఈ ప్రాంతాల్లో చిత్రీకరిస్తామని వివరించారు. ఎన్నో ఒడియా చిత్రాలు ఈ ప్రాంతంలో చిత్రీకరించారని, అవి ఎంతో విజయవంతమయ్యాయని ఈ సందర్భంగా ప్రముఖనటి ఉషాశ్రీ మిశ్రా ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడి తన అనుభవాలను పంచుకున్నారు. ప్రకృతికి నిలయాలుగా, దట్టమైన అటవీ ప్రాంతాలకు రాయగడ ఎంతో ప్రాముఖ్యమని, తాము నటిస్తున్న ఈ రెండు చిత్రాలు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించేందుకు దర్శకులు నిర్ణయించారన్నారు. తాను కూడా ఎన్నో ఒడియా చలన చిత్రాల్లో నటించే సమయంలో ఈ ప్రాంతంలో జరిగే షూటింగ్‌లో పాల్గొన్నానని వివరించారు.



విలేకర్లతో మాట్లాడుతున్న నటి ఉషశ్రీ మిశ్రా



చిత్రీకరణలో సాంకేతిక బృందం



ముహూర్తపు షాట్ క్లాప్ కొడుతున్న లఘుచిత్రాల నిర్మాత రాజు

శ్రీమందిరం సీఏఓగా రంజన్ దాస్

- రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులకు బదిలీ



రంజన్‌కుమార్ దాస్

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయ ప్రధాన పాలనాధికారిగా(సీఏఓ) రంజన్‌కుమార్ దాస్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన ఒడియా భాష, సాహిత్యం, సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా పని చేస్తున్నారు. రంజన్ దాస్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రస్తుతం కొనసాగుతున్న వీర్‌విక్రమ్ యాదవ్ పదవీకాలం పూర్తయినట్లు పరిగణిస్తారని రాష్ట్రప్రభుత్వ సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జగన్నాథ ఆలయ ప్రధాన పాలనాధికారి(సీఏఓ) పదవి రాష్ట్ర ఐఏఎస్ కేడర్‌లో ప్రత్యేక కార్యదర్శి హోదా, బాధ్యతలతో సమానంగా ఈ ఉత్తర్వులు పేర్కొన్నాయి. చేనేత, జౌళి, హస్తకళల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీకాంత పృష్టి పంచాయతీరాజ్, తాగునీటి శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. చీఫ్ సెక్రటరీ ఓఎస్‌డీ(ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా పనిచేస్తున్న దిలీప్ రౌత్రాయ్‌ను బదిలీ చేసి ఒడియా భాష, సాహిత్యం, సంస్కృతిశాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ హోదా జాయింట్ సెక్రటరీ పదవికి సమానమైనదిగా ఉత్తర్వులు తెలిపాయి. కొత్త నియామకంతో దిలీప్ రౌత్రాయ్ ఒడిశా పరిబార్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

'మేజర్' భార్యను వేధిస్తారా?

- సెటిల్‌మెంట్ అధికారిని ప్రశ్నించిన రాష్ట్ర హైకోర్టు
- సంబంధీకులకు నెల రోజుల్లోగా ఆర్ ఓఆర్ అందజేయాలని ఆదేశం



భువనేశ్వర్: చైనా-భారత్ మధ్య 1962లో జరిగిన యుద్ధంలో పాల్గొన్న మేజర్ శ్యామ్‌సుందర్ మహంతి ధైర్య సాహసాలకు ప్రతీకగా ప్రదానం చేసిన భూమి(రికార్డ్ ఆఫ్ రైట్స్-ఆర్‌ఓఆర్)ని ఆయన భార్యకు అందజేయాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. నెల రోజుల వ్యవధిలో భూమి సంబంధిత పట్టా సిద్ధం చేయాలని ఆదేశాల్లో పేర్కొంది. తదుపరి వారం రోజుల్లోగా సవరించిన ఆర్‌ఓఆర్‌ను పిటిషనర్ ఇంటికి వెళ్లి, ప్రత్యక్షంగా అందజేయాలని స్పష్టం చేసింది. దివంగత మేజర్ శ్యామ్‌సుందర్ మహంతి భార్య పూర్ణిమా మహంతి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ బిశ్వనాథ్ రథ్‌తో కూడిన ధర్మాసనం పై విధంగా ఆదేశాలు జారీ చేసింది. ధైర్యసాహసి మేజర్ భార్యను వేధించడం పట్ల న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సత్వర చర్యలతో ఆర్‌ఓఆర్ సిద్ధం చేసి, ఇంటి వద్దకే వెళ్లి పిటిషర్‌కు అందజేయాలన్నారు.

అధికారి తీరుపై అసహనం..

1962 చైనా-భారత్ యుద్ధంలో మేజర్ మహంత ధైర్య సాహసాలు ప్రదర్శించినందుకు గాను ప్రభుత్వం ఆయనకు శ్యామపూర్ ప్రాంతంలో 5 ఎకరాల భూమిని ప్రదానం చేసింది. 2004లో మహంతి మరణించగా.. కుటుంబ వ్యవహారాల నిమిత్తం ఆయనకు కేటాయించిన భూమిని భార్య పూర్ణిమ వివిధ సందర్భాలలో ఐదుగురు వేర్వేరు వ్యక్తులకు విక్రయించారు. మరికొంత భూమిని తనవద్దే ఉంచుకున్నారు. దీనిపై భువనేశ్వర్ అసిస్టెంట్ సెటిల్‌మెంట్ అధికారి అభ్యంతరం వ్యక్తం చేస్తూ భూమిని ప్రభుత్వ సాధారణ పాలనాశాఖ పేరిట నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ఉత్వర్వులను పూర్ణిమ మహంతి హైకోర్టులో సవాల్ చేశారు. ఆమె అభ్యర్థన పట్ల హైకోర్టు సానుకూలంగా స్పందించింది. అధికారి తీరును తప్పుబడుతూ ఉత్తర్వులు చట్టపరంగా ఆమోదయోగ్యం కాదని కొట్టివేసింది. ఈ భూమిని ధైర్య సాహసాలను గుర్తిస్తూ రిటైర్డ్ ఆర్మీ మేజర్‌కు కేటాయించడంతో ఈ విషయంలో సంబంధిత అధికారులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

బస్సును ఢీకొన్న ట్రక్కు

- పలువురు ప్రయాణికులకు గాయాలు



ఘటనా స్థలంలో గుమిగూడిన స్థానికులు

భువనేశ్వర్: ఖుర్దా-జట్నీ బైపాస్ రోడ్డు వంతెనపై మో బస్సు, ట్రక్కు ముఖాముఖి ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనతో ట్రక్కు క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కోగా.. కొంతమంది ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికులు రంగంలోకి దిగి, దుర్ఘటన పాలైన వాహనాల్లో చిక్కుకున్న బాధితులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. స్థానిక ఇంఫా వ్యాలీ ఠాణా పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. అగ్నిమాపక దళం వెంటనే అక్కడికి చేరుకొని సహాయక, పునరుద్ధరణ కార్యకలాపాలు పర్యవేక్షించారు. కట్టర్‌తో ట్రక్కు క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను వెలుపలికి తీశారు. ప్రమాదంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఖుర్దా-జట్నీ బైపాస్ వంతెనపై మో బస్సు ఎదురుగా వస్తున్న ఐషర్ ట్రక్కుని ముఖాముఖి ఢీకొనడంతో దుర్ఘటన చోటు చేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో కన్యకా పరమేశ్వరి జయంతి

రాయగడ/జయపురం: జిల్లాలోని జేకేపూర్‌లో వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగావళి నదీ జలాలను మహిళలు కలశాలతో తీసుకువచ్చి అమ్మవారి మందిర ప్రాంగణంలో నిలిపడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 9మంది నవ కన్యలకు అమ్మవారి అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు హోమం జరిపారు. మందిర కమిటీ అధ్యక్షుడు కోరాడ ఈశ్వరరావు, కార్యదర్శి లాడి లక్ష్మణరావు, కోశాధికారి పి.గౌరీశంకర్ పర్యవేక్షించారు. జయపురంలో మహిళలు చారిత్రాత్మక జగన్నాథ్ సాగర్ నుంచి కలశయాత్ర నిర్వహించారు.

బ్యాడ్మింటన్ విజేత ఘంటో



విజేతలు సమీర్, మిష్టాన్న ఘంటోలకు ట్రోఫి అందిస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా

- పర్లాకిమిడిలో ముగిసిన గజపతి జిల్లా బ్యాడ్మింటన్ టోర్నీ

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని గజపతి ఇండోర్ స్టేడియంలో శనివారం ప్రారంభించిన బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నీ ఆదివారం సందడిగా ముగిసింది. ఇందులో సమీర్ ఘంటో, మిష్టాన్న ఘంటో(తండ్రీ కొడుకులు) ట్రోఫీ కైవసం చేసుకున్నారు. రన్నర్స్‌గా న్యాయవాది ఎల్.సంజయ్, కోండలరావు నిలిచారు. కలెక్టర్ లింగరాజ్ పండా ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు ట్రోఫీ నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మరిన్ని ఇండోర్ గేమ్స్ నిర్వహించి, యువ క్రీడాకారులకు అవకాశం కల్పించాలని ఆకాంక్షించారు. తృతీయ బహుమతి మిరప్పల్లి ప్రసాద్ అందుకున్నారు. మొత్తం జిల్లావ్యాప్తంగా 40డబుల్స్ జట్లు పాల్గొన్నారు.



ప్రోత్సాహక బహుమతులు అందుకుంటున్న బాలికల జట్టు



ఫైనల్స్ సందర్భంగా ఆటగాళ్లతో నిర్వాహకులు

531 కిలోల గంజాయి స్వాధీనం

- 9మంది నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



బరంపురం: పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

బరంపురం: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన దాడుల్లో 531కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి 9మంది నిందితులను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... గంజాం జిల్లా పోలీసు పరిధి 16వ నంబర్ జాతీయ రహదారిలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు బరంపురం ఎక్సైజ్ కమిషనర్ రామచంద్ర మహంతికి సమాచారం అందింది. ఈ మేరకు కోడాసింగ్ బైపాస్ రోడ్డులో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. అటుగా వస్తున్న కంటైనర్‌ను పరిశీలించగా 22 బస్తాల్లో 420కిలోల గంజాయి పట్టుబడింది. సరుకును సీజ్ చేసి, నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో పెద్ద బజార్ పోలీసు స్టేషన్ పరిధి ఫస్ట్‌గేట్ జంక్షన్‌లో నివాసం ఉంటున్న దీపక్‌కుమార్, కాళుచరణ్ గౌడా, హర్యానా రాష్ట్రానికి చెందిన షబీర్ ఖాన్, ధీను మవత్‌గా గుర్తించారు. పట్టుబడిన సరుకు విలువ సుమారు రూ.78 లక్షలు ఉంటుందని పోలీసులు వివరించారు.

ముగ్గురి అరెస్ట్..

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి అలుసుగూడ రహదారిలో కలిమెల ఐఐసీ సూర్యప్రకాష్ నాయక్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నంబర్ ప్లేట్ లేని వాహనం అటుగా రావడాన్ని గుర్తించారు. వెంటనే అడ్డుకొని తనిఖీ చేయగా, 3బస్తాల్లో గంజాయిని గుర్తించారు. అందులోని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరంతా మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రశాంత్ తివారీ, అనీల్ పాయిటార్, బ్రజేష్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.30 వేల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. పట్టుబడిన సరుకు విలువ రూ.7 లక్షలు ఉంటుందని ఐఐసీ వివరించారు.

వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా..

జయపురం: విజయవాడ-రాంచీ 326 జాతీయ రహదారిపై పత్రపుట్ వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వరతండి తెలిపారు. సబ్ ఇన్‌స్పెక్టర్ శంకర పండా, సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో తరలిస్తున్న 41కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు బొయిపరిగుడ పోలీసు పరిధి జడియగుడ గ్రామానికి చెందిన బికారి ఖండపాని(20), సోముయల్ ఖండపాణి(38), రాజస్థాన్ లోని గాంధీపూర్‌కు చెందని దినేష్ ఖాన్(21), ఆలిఘడ్‌కు చెందిన అవిదేష్ బైర్వ(23)గా అరెస్ట్ చేశారు. పట్టుబడిన సరుకు విలువ రూ.4 లక్షల, 10 వేలు ఉంటుందని వివరించారు.



మల్కన్‌గిరి: పట్టుబడిన గంజాయితో నిందితులు



పట్టుబడిన గంజాయితో నిందితులు, పోలీసులు

క్లుప్తంగా

గంగా పుష్కరాలకు ప్రత్యేక బస్సు



బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎం మాధవ్

శ్రీకాకుళం అర్బన్: కాశీలో గంగా పుష్కరాలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఆదివారం ఉదయం 8 గంటలకు శ్రీకాకుళం-1 డిపో నుంచి బయలుదేరింది. ఈ బస్సును శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 3వ వరకు పుష్కరాలు జరుగుతాయన్నారు. సూపర్‌లగ్జరీ బస్సులో 36 మంది యాత్రికులు బయలుదేరి వెళ్లారని తెలిపారు. మే 2న కాశీలో బయలుదేరి 3వ తేదీ సాయంత్రం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, గ్యారేజ్ ఇన్‌చార్జి రాజు, ఎంపీ రావు, రాజు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యాలయ పాలక మండలి తొలి సమావేశం నేడు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన కొత్త పాలక మండలి (ధర్మకర్త) సభ్యుల తొలి సమావేశం సోమవారం ఉదయం 10 గంటల నుంచి ట్రస్ట్ బోర్డు మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఈవో వి.హరిసూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. 12 మంది సభ్యులతో కూడిన పాలక మండలిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నియమించిందని, తొలి సమావేశానికి ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు అధ్యక్షత వహిస్తారని ప్రకటించారు. గౌరవ పాలకమండలి సభ్యులంతా హాజరుకావాలని, కేవలం సభ్యులకు మాత్రమే సమావేశంలో అనుమతి ఉంటుందని ఈవో స్పష్టం చేశారు.

మంత్రిని కలిసిన యూహెచ్‌సీ చైర్మన్లు



మంత్రి ధర్మాన ప్రసాదరావుతో అర్బన్ హెల్త్ సెంటర్ల చైర్మన్లు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం పరిధిలోని ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లకు నూతనంగా నియమితులైన చైర్మన్లు ఆదివారం పెదపాడులో మంత్రి ధర్మాన ప్రసాదరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి సన్మానం చేశారు. కార్యక్రమంలో మొదలవలస రాజేంద్రకుమార్, డి.రమేష్ రాజు, డి.పి. దేవ్ తదితరులు పాల్గొన్నారు.

టైలర్ నిజాయితీ



భాస్కరరావుకు నగదు అందజేస్తున్న టైలర్ మధు

పాతపట్నం: పాతపట్నం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం వద్ద రూ.2.50 లక్షల నగదు చాకిపల్లి గ్రామానికి టైలర్ కనకాల మధుకు ఆదివారం దొరికింది. వెంటనే ఆ నగదును పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అప్పగించి నిజాయితీ చాటుకోవడంతో పలువురు అభినందించారు. పాతపట్నం కొత్త దేవాంగుల వీధి దిగువ ఉంటున్న బర్ల భాస్కరరావు ఆదివారం ఏటీఎంలో లక్ష రూపాయలు డిపాజిట్ చేసి మిగిలిన రూ.2.50 నగదు మరిచిపోయారు. భాస్కరరావు నగదు పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలో టైలర్ మధు నగదు తీసుకురావడంతో ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు సమక్షంలో ఆ మొత్తాన్ని భాస్కరరావుకు అందజేశారు. టైలర్ మధు నిజాయితీని మెచ్చుకుని భాస్కరరావు రూ.10 వేలు నగదు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో పోలీసులు జీవరత్నం, రైటర్ శంకర్ ఉన్నారు.


రబీ వరి దిగుబడి బాగు



ఉర్లాం వద్ద కోసిన వరి పంట నుంచి వచ్చిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో వేస్తున్న కోత మిషన్

నరసన్నపేట: ఖరీఫ్‌తో పోల్చితే రబీలో వరి దిగుబడి బాగా పెరిగిందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 32 నుంచి 36 బస్తాల వరకూ దిగుబడి వచ్చిందని అంటున్నారు. నరసన్నపేట మండలంలో ఎక్కువగా రైతులు ఆర్‌ఎన్‌ఆర్ వరి రకాన్ని వేశారు. సుగర్ లెస్ ధాన్యం కావడంతో బహిరంగ మార్కెట్‌లో ధర కూడా ఆశాజనకంగా ఉంది. కంబకాయ, కరగాం, నారాయణవలస, అంప్లాం, ఉర్లాం, మాకివలస, గొట్టిపల్లి, బుచ్చిపేట, నర్సింగపల్లితో పాటు పలు గ్రామాల్లో రబీ వరి వేశారు. ప్రస్తుతం కోత దశలో పంట ఉంది. పలు గ్రామాల్లో యంత్రాల సహకారంతో కోతలు చురుగ్గా నిర్వహిస్తున్నారు.

రాష్ట్రంలో నార్కో పరీక్షలకు సన్నాహాలు



భువనేశ్వర్: రాష్ట్రంలో నార్కో పరీక్ష కేంద్రం ఏర్పాటుకు స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ(ఎస్ఎఫ్ఎస్ఎల్) ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ సదుపాయంతో నేరస్తుల నార్కో పరీక్షల కోసం పోలీసులు ఇకపై రాష్ట్రం వెలుపలకు వెళ్లాల్సిన అవసరం తొలగిపోతుంది. ఎస్ఎఫ్ఎస్ఎల్ ప్రతిపాదన మేరకు త్వరలో నార్కో పరీక్ష నిర్వహణకు సౌకర్యం అందుబాటులోకి రానుందని భావిస్తున్నారు. స్థానికంగా ఈ సౌకర్యం లేకపోవడంతో గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. దేశవ్యాప్తంగా కొన్నిచోట్ల మాత్రమే ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. నేర పరీక్షలో కీలకంగా మారిన నార్కో పరీక్షకు నిందితులను సురక్షితంగా తరలించి, తీసుకు రావడం కష్టతరం అవుతుంది. అత్యంత వ్యయ ప్రయాసలతో కూడుకున్న ఈ సమస్యలను అధిగమించేందుకు రాష్ట్రంలోనే ఈ వ్యవస్థను అందుబాటులోకి తేవాలని ఎస్ఎఫ్ఎస్ఎల్ ప్రతిపాదించింది. ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాత, స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ వైద్యులు, ఫోరెన్సిక్ సైకాలజిస్టులను నియమిస్తుంది. శిక్షణ కోసం వారిని గాంధీనగర్ నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీకి పంపిస్తారు.

ముగిసిన బీకేఎంయూ సమ్మేళనం



బీకేఎంయూ సభలో మాట్లాడుతున్న గురునాథ్ సింగ్

పర్లాకిమిడి: పట్టణంలోని టౌన్ హాలులో గత 2 రోజులుగా జరుగుతున్న భారతీయ వ్యవసాయ మజ్దూర్ సంఘ్ రాష్ట్రస్థాయి సమ్మేళనం ఆదివారం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సంఘం ప్రతినిధులు పాల్గొనగా, ఒడిశాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. అలాగే బీకేఎంయూ భవిష్యత్ కార్యాచరణను రాష్ట్ర సంపాదకులు సురోజెన్నా ప్రకటించారు. ఇందులో భాగంగా మే 15నుంచి 31వరకు రాష్ట్రవ్యాప్త పాదయాత్ర, జూన్‌లో బ్లాక్‌స్థాయి సమావేశం, జూలైలో జిల్లాస్థాయి సమావేశాలు చేపట్టనున్నారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ.800లు ప్రభుత్వం ఇవ్వాలని, భూమిలేని పేదలకు ఇళ్ల మంజూరు తదితర అంశాలపై సదస్సులో చర్చించారు.

సమావేశంలో రాష్ట్రస్థాయి కార్యవర్గ సభ్యుల ఎన్నిక జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జెన్నా సుభాష్ చంద్రరావు, ఉపాధ్యక్షులుగా రఘునాథ గౌడో, పి.పద్మ, రాష్ట్ర కార్యదర్శిగా సురో జెన్నా, సహాయ కార్యదర్శిగా గురునాథ ప్రధాన్, త్రైలోక్య నాథ్, శంకర్ బారిక్, జయంతి దాస్ తదితరులు ఎన్నికయ్యారు.



సమ్మేళనంలో పాల్గొన్న వివిధ జిల్లాల ప్రతినిధులు

అరసవల్లిలో వైశాఖి సందడి

- ఒక్కరోజులో రూ.11.96 లక్షల ఆదాయం
- విపరీతమైన రద్దీతో ఇబ్బంది పడిన భక్తులు



సంప్రదాయ పూజలతో పుష్కరిణి ఒడ్డున భక్తజనం

అరసవల్లి: వైశాఖ మాసం రెండో ఆదివారం సందర్భంగా అరసవల్లి ఆదిత్యుడికి పెద్ద ఎత్తున భక్తులు మొక్కులు చెల్లించి స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేకంగా ఇంద్ర పుష్కరిణి ఒడ్డున మహిళలు పెద్ద సంఖ్యలో సంప్రదాయ పూజలు చేసి స్వామికి ప్రసాదాలను నివేదించారు. ఎండ ప్రభావం భక్తులపై పడకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ పలు ఏర్పాట్లు చేసినప్పటికీ భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో ఇబ్బందులు తప్పలేదు. ఉదయం 9 గంటల నుంచి భక్తుల తాకిడి అధికమైంది. మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులు దర్శనాలకు బారులు తీరారు. ప్రతి క్యూ వద్ద మంచినీటి ప్యాకెట్లు, ఉచిత మజ్జిగ, ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆదిత్యుడిని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లోచర్ల రమేష్ తదితర ప్రముఖులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు, అర్చకులు గౌరవ దర్శనాలు చేయించారు.

భక్తులకు తప్పని ఇక్కట్లు

వైశాఖ ఆదివారం సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో రావడంతో ఇబ్బంది తప్పలేదు. ఈశాన్య ద్వారం నుంచి కేశఖండన శాల మీదుగా వచ్చిన భక్తులకు ఎలా వెళ్లాలో తెలియలేదు. ఇంద్రపుష్కరిణిలో నీరు లేకపోవడంతో గ్రామీణ ప్రాంత మహిళలంతా సంప్రదాయ పూజలంటూ ఉచిత దర్శనాల మార్గంలోనే పూజలను నిర్వహించారు. దీంతో ఉచిత దర్శనాల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైశాఖ రెండో ఆదివారం సందర్భంగా భక్తుల దర్శనాలు పెరగడంతో ఒక్కరోజులో రూ.11,96,876 ఆదాయం లభించింది. విశిష్ట, ప్రత్యేక దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.7,98,800, పూజలు విరాళాల ద్వారా రూ. 68,076, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.30 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు.



ప్రత్యేక దర్శనాల క్యూలో భక్తుల రద్దీ

వైభవంగా సహస్ర గళార్చన



సహస్ర గళార్చన చేస్తున్న సాయి భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న బాలవికాస్ సంబరాల సందర్భంగా సాయంత్రం వెయ్యి మంది సభ్యులతో సహస్ర గళార్చన చేశారు. ఈ సందర్భంగా సత్యసాయిపై పాటలను ఆలపించారు. అలాగే చిన్నారులు నృత్యాల ప్రదర్శన కూడా జరిగింది.

ఆకట్టుకున్న ద్విగళావధానం



ద్విగళావధానంలో పాల్గొన్న అవధానులు

పలాస: కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు విద్యాలయంలో ఆదివారం లలిత కళారంజని ఆధ్వర్యంలో జరిగిన ద్విగళావధానం సాహిత్యప్రియులను విశేషంగా ఆకర్షించింది. లలిత కళారంజనీ అధ్యక్షుడు కె.చిన్నారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అవధానులు సుసరాపు చంద్రశేఖరశర్మ, బంకుపల్లి రమేష్‌శర్మ, రంప సాయికుమార్ శర్మలు పాల్గొన్నారు. బందరు దుర్గా ప్రసాద్, కోత ఉపేంద్రరావు, గుమ్మడి సాంబమూర్తి, పూడి లక్ష్మీపతి, భేరి చక్రపాణి, కణితి ఈశ్వరరావు, నిర్విశానంద స్వామి, ఇప్పిలి ఏకాహం తదితరులు ప్రశ్నలు వేశారు. ఈ సందర్భంగా చిన్నారి మాట్లాడుతూ ద్విగళావధానం అనే ప్రక్రియ తెలుగు సాహిత్యంలో వినూత్నమైనదన్నారు. అందరూ ఆదరించాలని కోరారు. బూర్జి కోటేశ్వరరావు మాట్లాడుతూ లలిత కళారంజనీ సాహితీ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో సాహితీకారులు పెంట ఓంప్రకాష్, శివజ్యోతి, నిశితాసి, తంగుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నీలమణి దుర్గ పండగకు పకడ్బందీ ఏర్పాట్లు

- కమిటీ, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి
- అధికారులకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి. చిత్రంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పాతపట్నంలో వెలసిన నీలమణి దుర్గమ్మ అమ్మవారి పండగలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులకు ఆదేశించారు. పాతపట్నంలో మే 21 నుంచి 30 వరకు ఉత్సవాలు జరగనున్న సందర్భంగా కమిటీ, అధికారులను సమన్వయ పరిచేందుకు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ రెండు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అందరి భాగస్వామ్యం, సహకారంతో పండగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రవాణా, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో కంట్రోల్ రూమ్ నిర్వహించాలన్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఎంహెచ్ఓ బి.మీనాక్షి, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ హరిసూర్యప్రకాష్, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు, జిల్లా అగ్నిమాపక అధికారి వీరభద్రరావు, పాతపట్నం ప్రెసిడెంట్ జోగారావు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పోలితాత సంబరం



జి.సిగడాం మండలం చెట్టుపొదిలాంలో పోలితాత సంబరాలు అంబరాన్ని తాకాయి. ఆదివారం రథాలపై పోలితాతను ఊరేగించారు. వందలాది మహిళలు ముర్రాటలతో వెళ్లి చల్లదనం చేసి మొక్కులు తీర్చుకున్నారు. - జి సిగడాం

కణితి సేవలు మరువలేనివి



సంతాప సభలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

పలాస: దివంగత మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం సేవలు మరువలేనివని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని కణితి విశ్వనాథం స్వగృహం ఆవరణలో ఆదివారం కుటుంబ సభ్యులు సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశ్వనాథం వైద్య వృత్తిలో రోగులకు అనేక సేవలు అందించారని గుర్తు చేశారు. లయన్స్ క్లబ్ ద్వారా 50 ఏళ్ల క్రితమే మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు అందించి ప్రజా వైద్యునిగా గుర్తింపు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, గౌతు శిరీష, పేరాడ తిలక్, బల్ల గిరిబాబు, వజ్జ బాబూరావు, దువ్వాడ జీవితేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ శ్రీధర్, హేమబాబు చౌదరి, పాలవలస వైకుంఠరావు, కోత పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకూర్మనాథుని కల్యాణ మహోత్సవానికి సిద్ధం



కొట్నం దంపు జరుగుతున్న దృశ్యం

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథుని ఉత్సవాల్లో ప్రముఖమైన కల్యాణోత్సవం వైశాఖ మాస ఏకాదశి సందర్భంగా సోమవారం నిర్వహించనున్నారు. ఉత్సవం కోసం దేవస్థాన అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇప్పటికే తొమ్మిది రోజుల పాటు జరిగిన వేడుకల్లో పందిరి రాట, అంకురార్పణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కూర్మనాథుని ఆవిర్భావం నుంచి ఈ కల్యాణం జరుగుతోంది. కొట్నం దంపులో ధాన్యాన్ని దంచి వచ్చిన బియ్యంతో స్వామి కల్యాణం రోజున నైవేద్యం చేసి నివేదిస్తారు. సాయంత్రం స్వామి కల్యాణ మూర్తులను పురవీధుల్లో ఊరేగిస్తారు.

వైభవంగా కొట్నం దంపు

శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం వేళలో ఆలయంలో వైభవంగా కొట్నం మహోత్సవం నిర్వహించారు. తిరుక్కల్యాణం ముందు రోజు జరిగే ఈ కొట్నం దంపు ముత్తైదువులతో శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం మూలవిరాట్‌కు విశేష అర్చనలు, హోమాలను ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం వేళ ఆస్థాన మంటపంలో స్వామి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామిలను వేంచింపచేసి రాజా వారి గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. విశ్వక్షేన పూజ, పరిషత్ వంటి వైదిక క్రియలు జరిగాయి. అనంతరం కొట్నం దంపు కోసం వినియోగించే కర్ర రోలుకు ప్రత్యేక పూజలు చేసి, లక్ష్మీదేవికి పూజ అనంతరం కొట్నం దంపు ప్రారంభించారు. కొట్నం దంపులో ధాన్యాన్ని దంచగా వచ్చిన బియ్యంతో ప్రసాదాన్ని తయారు చేసి స్వామికి నివేదిస్తారు. కార్యక్రమంలో స్థానాచార్యులు శ్రీ భాష్యం పద్మనాభాచార్యులు, కిషోర్ బాబు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మెతుకు వెతుకులాటలో..



మెతుకు వెతుక్కుంటూ వచ్చిన బతుకులివి. ఇల్లూ వాకిలి విడిచి పిల్లాపాపలతో ఊరూరూ సంచరిస్తూ రోజులు గడిపే జీవితాలివి. ఎక్కడో తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా జనగాంకు చెందిన కొంత మంది సంచార జాతి కుటుంబాల వారు టెక్కలి పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ప్రాణాలు అరచేత పట్టుకుని సర్కస్ చేస్తున్నారు. ఉదయం వారికి అనుకూలమైన ప్రాంతంలో బస చేస్తున్నారు. ఇలా టెక్కలి వంశధార కార్యాలయం ఆవరణలో సంచార జాతి కుటుంబాలు చంటి బిడ్డలతో సహా బస చేయడం కనిపించింది. - టెక్కలి

సంబరాల సమయం

వసంత కోకిల సంబరాల సమయాన్ని చాటింపు వేస్తుంది. కొత్త చిగురుపై చైత్ర కిరణాలు ప్రకాశించే కాలంలో పల్లె పెద్ద ముత్తైదువులా ముస్తాబవుతుంది. చైత్రం పోయి వైశాఖం వచ్చే వేళలో ఊరు హోరెత్తేలా ఉత్సవ ఉత్సాహం ద్విగుణీకృతమవుతుంది. జ్యేష్ఠం, ఆషాడం వరకు పల్లె వాకిట చీకటి అడుగు పెట్టదు. తప్పెటగుళ్ల చప్పుళ్లు, విద్యుత్ దీపాల వెలుగులు, బంధువుల రాకపోకలతో గ్రామంలో సంబరాల సంగ్రామం జరుగుతుంది. సిక్కోలు పల్లెలకు ఇది సంబరాల సమయం.

- పల్లెల్లో గ్రామదేవత సంబరాలు
- ఉపాధి పొందుతున్న కళాకారులు



గ్రామ దేవత ఉత్సవాల సందర్భంగా అమ్మవార్ల ఊరేగింపు

ఇచ్ఛాపురం రూరల్: పల్లె పెద్ద ముత్తైదువులా కనిపిస్తోంది. ఊరి అమ్మవారికి సంబరాలు, గ్రామ దేవతలకు చల్లదనాలు, వేడుకలు, ఉత్సవాలతో విశ్వరూప విన్యాసం చేస్తోంది. చైత్రంలో కోయిల కూత వినిపించింది మొదలు సంబరాల సమయం ఆసన్నమైంది. స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవం మొదలు పెద్దమ్మ ఉత్సవం, శ్యామలమ్మ, కాళమ్మ, బాల త్రిపుర సుందరి, అసిరిపోలమ్మ.. ఇలా గ్రామ దేవతల ఉత్సవాలతో పల్లెల్లో సందడి నెలకొంది.

చల్లదనాలతో మొదలు..

ఒకనాడు నిత్యం కరువు కాటకాలు కన్నీళ్లతో సావాసం చేసిన గ్రామాలు.. ఆ పరిస్థితుల నుంచి బయటపడడానికి అమ్మవార్లను నమ్ముకున్నాయి. తల్లులకు చల్లదనం చేస్తే తమ ఊరిని చల్లగా చూస్తాయని భావించి చల్లదనం సంబరాలు చేసేవారు. ఆ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. చైత్ర మాసం మొదలైన నుంచి జ్యేష్ఠ మాసం వరకు పల్లెల్లో గ్రామ దేవతలకు చల్లదనం చేయడం సిక్కోలు జిల్లా వాసుల ఆచారం. ఈ సమయాల్లో సహజ సిద్ధంగా పండిన తాజా జీడి, మామిడి, పనస, పైనాపిల్ వంటి ఫలాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. ఆది, మంగళ, గురువారాల్లో పొలిమేరలో ఉన్న దేవతలకు మేళ, తాళాలతో వెళ్లి మొక్కుబడులు తీర్చుకుంటారు. మెండుగా వర్షాలు పడాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ అమ్మవార్లకు కొత్త బట్టలు కానుకగా ఇస్తారు.



పొలిమేర దేవతలకు ఘటాలతో భక్తుల చల్లదనం

కళాకారులకు ఉపాధి

వేసవి నుంచి కాస్త వానలు పడే సమయం వరకు కళాకారులకు ఇక్కడ చక్కటి ఉపాధి లభిస్తోంది. ఈ ఉత్సవాలు జరిగే సమయాల్లో క్షణం తీరుబాటు లేకుండా కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. అమ్మవారి సన్నాయి మేళం కళాకారులు, వీధి వేషధారణలు వేసే కళాకారులు, కోయ నృత్యం, అంజాట, తప్పెట గుళ్లు, పాములోళ్లు, డప్పు కళాకారులు, కాళికా వేషధారణ, పులి, సింహాల వేషధారులు, కోలాటం కళాకారులు..ఇలా ఒకటేమిటి వందలాది మంది కళాకారులకు ఈ ఉత్సవాలు ఉపాధి కల్పిస్తుంటాయి. వీధుల్లో చిన్నపాటి దుకాణాల నుంచి సర్కస్, జాయింట్ వీల్, డిస్కో చైర్స్ వంటి పరికరాలతో ఉపాధి పొందుతుంటారు వ్యాపారులు.

22 ఏళ్ల తర్వాత..



22 ఏళ్ల తర్వాత మా గ్రామంలో గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. అలాగే ఏటా ఏప్రిల్, మే నెలల్లో పొలిమేర దేవతలకు ఉత్సవాలు, చల్లదనాలు చేయడం ద్వారా పాడి పంటలకు కొదవ ఉండదు. ప్రజలంతా సుభిక్షంగా ఉంటారన్నది సత్యం. ప్రస్తుతం పండే ఫలాలే అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తుంటాం.

- దక్కత నూకయ్యరెడ్డి, గ్రామ పెద్ద, తేలుకుంచి

క్లుప్తంగా

బాణసంచా తయారీ స్థలం పరిశీలన



పేలుడు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ అప్పారావు, డీటీ సూర్యనారాయణ

గుర్ల: మండలంలోని గవిడి పేట వద్ద బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించిన స్థలాన్ని ఆర్డీఓ అప్పారావు ఆదివారం పరిశీలించారు. పేలుడుకు గల కారణాలను డీప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. కూలిపోయిన షెడ్లు, భవనాలను పరిశీలించారు. అలాగే డీఎస్పీ మోహన్ రావు కూడా సంఘటన స్థలానికి వచ్చి పరీక్షించారు. జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆర్‌డీఓ తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి



గాయపడిన జగన్నాథమ్మ

సీతానగరం: మండల కేంద్రంలోని రాష్ట్ర రహదారిలో హనుమాన్ జంక్షన్ వద్ద ఆదివారం రోడ్డు దాటుతుండగా ఓ మహిళను లారీ ఢీ కొనడంతో మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. అప్పయ్యపేట గ్రామానికి చెందిర కె జగన్నాథమ్మ(70) సీతానగరం నుంచి స్వగ్రామం వెళ్లడానికి రోడ్డు దాటుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రురాలిని 108 సిబ్బంది చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పార్వతీపురం ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదుచేశారు.

విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన రాజుకుమారి (ఫైల్)

భామిని: మండలంలోని నేరడి-బి గ్రామానికి చెందిన విద్యార్థిని అడ్డసారి రాజుకుమారి(15) ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం ఇంట్లో ఎలుకలు మందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురి కాగా కుటుంబసభ్యులు భామిని పీహెచ్‌సీకి, పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ విద్యార్థిని మృత్యువాత పడినట్లు కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. కొత్తూరు ప్రభుత్వ వసతి గృహంలో పదవ తరగతి చదువుతున్న రాజుకుమారి ఇటీవల జరిగిన పబ్లిక్ ఎగ్జామ్స్ సక్రమంగా రాయలేకపోయానని మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిందని తల్లి అడ్డసారి మహాలక్ష్మి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వై.అమ్మాన్‌రావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పేరెంట్స్ మీటింగ్‌లో గందరగోళం

చీపురుపల్లిరూరల్: మండలంలోని కర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో గందరగోళం నెలకొంది. పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ జరుగుతున్న క్రమంలో గ్రామానికి చెందిన కొంతమంది యువత, పిల్లల తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల తీరుపై మండిపడ్డారు. ఉపాధ్యాయులుగా ఇలాంటి నడవడిక మంచిది కాదని, తీరు మార్చుకోవాలని గట్టిగా చెప్పారు. పాఠశాల వద్ద గొడవ జరుగుతున్న క్రమంలో తెలిసిన సమాచారం మేరకు చీపురుపల్లి పోలీసులు వెళ్లి గొడవను నియంత్రించి ఉపాధ్యాయులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లగా ఎస్సై సన్యాసినాయుడు కౌన్సెలింగ్ చేసి పంపించారు. ఇదే విషయమై హెచ్‌ఎం కామేశ్వరి మాట్లాడగా ఈ విషయం ఇంతవరకు తన దృష్టికి రాలేదని, ఓ ఉపాధ్యాయుడు విద్యార్థిని శనివారం కొట్టారని, విద్యార్థినుల పట్ల ఒక ఉపాధ్యాయుడు మాట్లాడే భాష బాగాలేదని పేరెంట్స్ మీటింగ్‌లో తనకు ఫిర్యాదు చేశారని, ఇక ముందు ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తామని చెప్పారు. ఈ విషయం జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు తెలిపారు.

నేడు కోదండ రామస్వామి కల్యాణం



సీతారామస్వామివార్లు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీకోదండ రామస్వామి ఆలయంలో సోమవారం రాత్రి 7 గంటలకు సీతారామస్వామి వార్షిక కల్యాణం జరగనుంది. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం శ్రీరామ సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనములు, విశేష హోమములు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించనున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి బుద్ద మహాలక్ష్మి నగేష్ ఆదివారం తెలిపారు. రాత్రి ఏడు గంటలకు సీతారామస్వామి వార్షిక కల్యాణం జరపనున్నామని ఆలయ అర్చకులు వీవీ అప్పలాచార్యులు తెలిపారు.

‘ప్రత్యేక’ ప్రోత్సాహం



భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు శిక్షణ ఇస్తున్న ఐఈఆర్‌టీలు

- విద్య, ప్రయాణం, సంరక్షకుల భత్యాల చెల్లింపు
- జిల్లాకు విడుదలైన మొత్తం రూ.47,07,000
- అర్హుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ
- జిల్లాలో 27 భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక శిక్షణ

జిల్లాలో భవిత కేంద్రాల వివరాలు..

జిల్లాలో గుర్తించిన విభిన్న ప్రతిభావంతులు	: 3786 మంది
పాఠశాలల్లో, భవిత కేంద్రాల్లో ఉన్నవారు	: 3428 మంది
మొత్తం కేంద్రాలు	: 27
సేవలు పొందుతున్న వారు	: 1824 మంది
ఫిజియోథెరపిస్టులు	: 9 మంది
ఐఈఆర్‌టీలు	: 43 మంది
ఆయాలు	: 27 మంది

చీపురుపల్లి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఇంటికే పరిమితం కాకుండా వారిలో మానసికంగా, శారీరకంగా ఎదుగుదల తీసుకురావాలనే లక్ష్యంతో భవిత కేంద్రాల ద్వారా వారికి మానసిక, శారీరక థెరపీ అందిస్తూ చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోంది. మాటలు రాని, మానసికంగా ఎదుగుదల లేని పిల్లలు ఇళ్లలోనే ఉండి మరింత మానసికంగా కుంగిపోకుండా వారిని భవిత కేంద్రాలకు తీసుకొస్తే అక్కడ ఆటపాటలు, ఇతర పరికరాలతో వారిలో పరివర్తన తీసుకొచ్చేలా సిబ్బంది శిక్షణ ఇస్తున్నారు. దీంతోపాటు భవిత కేంద్రాలకు ఫిజియోథెరపిస్టులను నియమించి శారీరక థెరపీ అందిస్తున్నారు. మరికొంత మంది ఇల్లు కదలలేని పిల్లలకు వారానికోసారి వారి ఇళ్లకే సిబ్బంది వెళ్లి అక్కడ థెరపీ సేవలు అందిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకొచ్చేందుకు తల్లిదండ్రులకు కూడా ప్రభుత్వం అలవెన్సులు కల్పిస్తోంది. తాజాగా జిల్లా వ్యాప్తంగా భవిత కేంద్రాల ద్వారా సేవలు పొందుతున్న 1824 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంరక్షకులకు రవాణా, చదువుకు సంబంధించిన అలవెన్సులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు 1824 మందికి రూ.47,07,000 నిధులు అర్హుల ఖాతాల్లోకి జమ చేసింది.

ప్రోత్సాహకాల విడదల ఇలా..

జిల్లాలో 27 భవిత కేంద్రాలు ఉన్నాయి. వాటి ద్వారా 1824 మంది విభిన్న ప్రతిభావంతులు సేవలు పొందుతున్నారు. వారికి ట్రాన్స్‌పోర్టు, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్, ఎస్కార్ట్, బాలికల ప్రత్యేక విద్య, స్టైపెండ్ పేరుతో ప్రోత్సాహకాలను ప్రభుత్వం విడుదల చేసింది. అందులో భాగంగానే రవాణా అలవెన్స్‌ను జిల్లాలోని 379 మందికి నెలకు రూ.3000 చొప్పున, ఎస్కార్ట్ అలవెన్స్‌లో భాగంగా 298 మందికి రూ.3 వేలు చొప్పున, హోమ్ బేస్ట్ ఎడ్యుకేషన్ అలవెన్స్ 270 మందికి రూ.3 వేలు చొప్పున, రీడింగ్ అలవెన్స్ 112మందికి రూ.3 వేలు చొప్పున, గర్ల్ స్టైపెండ్ కింద 765 మందికి రూ.2 వేలు చొప్పున నిధులు విడుదలయ్యాయి.



ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న వైద్యురాలు

అర్హుల ఖాతాల్లో అలవెన్స్‌లు

జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్ష ద్వారా నిర్వహిస్తున్న భవిత కేంద్రాల ద్వారా సేవలు పొందుతున్న విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు విడుదల చేసింది. నేరుగా అర్హుల బ్యాంక్ ఖాతాల్లో అలవెన్స్‌లు జమ చేసింది. రవాణా, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్, గర్ల్ స్టైపెండ్, ఎస్కార్ట్ అలవెన్స్‌ల రూపంలో ప్రభుత్వం ప్రోత్సాహకాలు జమ చేసింది.

– సూర్యారావు, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్, విజయనగరం

రూ.3 వేలు ఖాతాలో జమ



సంవత్సరం నుంచి మా ప్రణవ్‌కుమార్‌ను భవిత కేంద్రానికి తీసుకొస్తున్నాం. అప్పుడు కంటే ఇప్పుడు మెరుగ్గానే ఉన్నాడు. రోజూ బాబును భవిత కేంద్రానికి తీసుకొస్తున్నందుకు ప్రభుత్వం మా ఖాతాలో రూ.3 వేలు జమ చేసింది. భవిత కేంద్రాలు ఏర్పాటు చేసి పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వారిలో చైతన్యం తీసుకొస్తున్నారు. దీంతో బాటు అలవెన్స్ ఇవ్వడం గొప్ప విషయం.

– కె.సునీల, చీపురుపల్లి

చాలా మేలు చేస్తున్నారు....



మా బాబు నితిన్‌ను సంవత్సరం నుంచి భవిత కేంద్రానికి తీసుకొస్తున్నాం. ఇక్కడ చాలా బాగా శిక్షణ ఇస్తున్నారు. తాజాగా మా ఖాతాలో రూ.3 వేలు ప్రభుత్వం జమ చేసింది. భవిత కేంద్రాల ద్వారా చాలా ఉపయోగం ఉంది. మా పిల్లల్లో మంచి మార్పు కనిపిస్తోంది.

– ఎస్.హైమ, వంగపల్లిపేట, చీపురుపల్లి

దర్యాప్తు ముమ్మరం



మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు, ఎస్సై సురేంద్రనాయుడు

రామభద్రపురం: మండలంలోని రావివలస పంచాయతీ పంతెమామిడివలసకు వెళ్లే దారిలో సీతగుండమ్మ గుడి వద్ద జరిగిన హత్య కేసుకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బుచ్చెంపేటకు చెందిన సాగి వెంకటరమణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ హత్యకు సంబంధించి సీఐ తిరుమలరావు, ఎస్సై సురేంద్రనాయుడులు మృతుని బంధువులతో మాట్లాడి రెండోరోజు ఆదివారం కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వారు ఈ నెల 26వ తేదీన విశాఖపట్నం వెళ్లి వస్తానని చెప్పి వెంకటరమణ ఇంట్లో నుంచి బయటకు వచ్చేశాడు. తర్వాత ఏం జరిగిందో ఏమో గాని మండలంలోని మారుమూల గిరిజన గ్రామంలో మృతి చెంది కనిపించాడు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా పలు కోణాల్లో . అనుమానితులకు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

టీవీఎస్‌ను కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస జాతీయరహదారి, ఘాట్‌రోడ్డుపై ఒడిశా నుంచి సాలూరు వైపు వస్తున్న టీవీఎస్ ఎక్సెల్‌బండిని, సాలూరు నుంచి ఒడిశా వెళ్తున్న గుర్తుతెలియని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో టీవీఎస్ ఎక్సెల్ నడుపుతున్న రామభద్రపురం మండలం కొట్టక్కి గ్రామానికి చెందిన పోతురాజు చిన్నారావు త్రీవగాయాల పాలయ్యాడు. స్థానికులు 108లో సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుంప ఆలయం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న కాపారపు పౌండేషన్ ప్రతినిధి కాపారపు సత్యనారాయణ

కొమరాడ: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన గుంపస్వామిశ్వర ఆలయాన్ని పార్టీలకు అతీతంగా అందరం కలిసి అభివృద్ధి చేద్దామని కాపారపు పౌండేషన్ ప్రతినిధి కాపారపు సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన గుంపసోమేశ్వర ఆలయ ప్రాంగణంలో కాపారపు పౌండేషన్ ఆధ్వర్యంలో కొమరాడ మండల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఆనంతరం ఆలయ అభివృద్ధి కమిటీని నియమించారు. ఈ సందర్భంగా పలువురు కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇంత చరిత్ర కలిగిన దేవాలయానికి ఆలయ అభివృద్ధితో పాటు పునర్నిర్మాణానికి అందం సహకరిస్తామని పేర్కొన్నారు. నాగవళి, జంఝావతి నదుల సంగమం మధ్య నుంచి ఆలయం వద్దకు వెళ్లడానికి కాజ్‌వే నిర్మించాలని, కోటిపాం కొత్త కాలనీ నుంచి ఆలయం వరకు రహదారి అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే దేవాలయం చుట్టుపక్కల రాతి కట్టు నిర్మాణం జరిగితే వరదలు వచ్చినప్పుడు గర్భగుడికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.ఆలయ కమిటీ ట్రస్టు సభ్యులుగా కొనసాగించడానికి రూ.10,116 విరాళంగా ఇవ్వాలని తీర్మానం చేశారు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శీర తిరుపతి రావు, కోటిపాం సర్పంచ్ భర్త సుంకరి వెంకటిరమణ, గంగరేగువలస సర్పంచ్ కోడితిరుపతిలకు ఆలయ అభివృద్ధి బాధ్యతలు అప్పగించడానికి సమావేశంలో పాల్గొన్న సభ్యులంతా ఏకగ్రీవంగా అమోదించి తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైస్సార్‌సీపీ మండల కన్వనర్ ద్వారపురెడ్డి జనర్దనరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గులిపిల్లి సుదర్శనరావు, కురుపాం మాజీ జెడ్పీటీసీ అందవరపు కోటీశ్వర రావు, సీనియర్ నాయకులు శనపతి ఉదయ్‌శేఖర్ పాత్రుడు, నంగిరెడ్డి మధుసూదనరావు, డాక్టర్ శెట్టి మధుసూదన రావు, వడ్డి గాంధీ, కల్లికోట సర్పంచ్ దత్తి మురళీకృష్ణ, వన్నాం సర్పంచ్ భర్త మాదలింగి మహిపతినాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

3న అండర్-16 జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న అండర్-16 బాలురు, బాలికల జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం శివారు విజ్జీ క్రికెట్ మైదానంలో బుధవారం ఉదయం 7 గంటలకు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వైట్‌డ్రెస్, సొంత క్రికెట్‌తో పాటు, విజయనగరం జిల్లాలో జన్మించిన జనన ధ్రువీకరణపత్రం, ఇదే జిల్లాలో చదువుతున్న స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు ఒరిజినల్స్‌తో పాటు, జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా తీసుకురావాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా క్రీడాకారులు 2007 సెప్టెంబర్ 1 నుంచి 2009 ఆగస్టు 31 లోపు జన్మించిన వారు పోటీలకు అర్హులన్నారు. పోటీలకు ఎంపికైన బాలబాలికలకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9666818126 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శంకరాచార్యుల సాహిత్యం నేటితరానికి ఎంతో ఉపయోగం



కట్టమూరి చంద్రశేఖరమ్‌ను సత్కరిస్తున్న విజయభావన సాహితీ సమాఖ్య ప్రతినిధులు

- శ్రీ సూర్యసదన ఆస్థాన పండితుడు డాక్టర్ కట్టమూరి

విజయనగరం టౌన్: నేటితరానికి శంకరాచార్యుల సాహిత్యం ఎంతగానో ఉపకరిస్తుందని శ్రీ సూర్యసదన ఆస్థాన పండితుడు డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరం పేర్కొన్నారు. విజయభావన సాహితీ సమాఖ్య 520వ సభ శ్రీ శంకర సాహితీ వైభవం అనే అంశంపై స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమంలో వక్తగా పాల్గొన్న ఆయన జగద్గురు శ్రీ శంకరుల సాహితీ వైభవం అనే అంశంపై ప్రసంగించారు. జగద్గురుపై బాలల నుంచి వృద్ధుల వరకూ తప్పనిసరిగా అధ్యయనం చేయాలని సూచించారు. శంకరాచార్యుల సౌందర్యలహరి, కనకధారాస్తవం, భజగోవిందం శ్లోకాలు రాగయుక్తంగా ఆలపించి ఆహూతులను ఆనందింపజేశారు. శంకరమఠం అధ్యక్షుడు జీఎస్ఏ.నరసింహం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు స్వీయ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో మహారాజా మహిళా కళాశాల విశ్రాంత ప్రాచార్యులు కె.లలితాశంకర్, డాక్టర్ జక్కు రామకృష్ణ, భోగరాజు సూర్యలక్ష్మి, శిరీష రఘురాం, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం, నేమాని పట్టాభిరామం, దామరాజు శంకరం తదితరులు పాల్గొన్నారు.

ఆటందం నీ హద్దురా..!

- నేటినుంచి వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం
- నెలాఖరు వరకు సమ్మర్ కోచింగ్ క్యాంపులు



వాలీబాల్ ఆటలో క్రీడాకారులు. (ఫైల్)

పార్వతీపురంటౌన్: వేసవి సెలవులు వచ్చాయంటే చిన్నారులకు పండగే. పుస్తకాలతో కుస్తీపట్టిన వారు ఒక్కసారిగా రెక్కలు వచ్చి సంతోషంతో విహరించనున్నారు. వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడిపేద్దామని ఎదురు చూస్తున్న విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు క్రీడా ప్రాధికార సంస్థ ముందుకొచ్చింది. నెల రోజుల పాటు 18 రకాల ఆటలపై శిక్షణ ఇచ్చేందుకు షెడ్యూల్ ప్రకటించింది. క్రీడల పట్ల ఆసక్తి, నైపుణ్యం పెంచడం, ప్రతిభను వెలికితీయడం, శారీరక, మానసికోల్లాసం కల్పించడం వేసవి శిబిరాల ప్రధాన లక్ష్యం. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం కలుగుతుంది. ఆటల్లో మరింత నైపుణ్యం సాధిస్తారు. క్రీడలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

శిక్షణ పరికరాలు సిద్ధం

పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో 50 ప్రాంతాల్లో 18 రకాల ఆటలకు శిక్షణ ఇస్తారు. సోమవారం 31వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 6గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు శిక్షణ ఇస్తారు. ఈ మేరకు సంబంధిత ప్రాంతాల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు, పలు క్రీడాసంఘాల ప్రతినిధులు ఆసక్తిగా ముందుకొచ్చారు. శిక్షణకు అవసర మైన పరికరాలను తెప్పించేందుకు క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే కోచ్‌లను సిద్ధం చేశారు. శిబిరాల వద్ద మౌలిక వసతులు ఉండేలా చూస్తున్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో శిక్షణ కేంద్రాలు

బాక్సింగ్: చర్చి వీధి, కాలేజీగ్రౌండ్ పార్వతీపురం
ఖోఖో: జెడ్పీహెచ్ఎస్ పాలకొండ
వెయిట్ లిఫ్టింగ్: ప్రభుత్వ జూనియర్ కళాశాల పార్వతీపురం
బ్యాడ్మింటన్: జెడ్పీహెచ్ఎస్ సీతానగరం, వసుంధరానగర్ పార్వతీపురం
కరాటే: ఎలక్ట్రికల్ కార్యాలయం పార్వతీపురం, జెడ్పీహెచ్ఎస్ బందలుప్పి, జెడ్పీహెచ్ఎస్ కురుపాం, జెడ్పీహెచ్ఎస్ మామిడిపల్లి, జెడ్పీహెచ్ఎస్ పెదబొండపల్లి, టీడబ్ల్యుడీహెచ్ తోణాం, ప్రియదర్శిని స్కూల్ నర్సిపురం, జెడ్పీహెచ్ఎస్ మార్కొండపుట్టి
హ్యాండ్‌బాల్: జెడ్పీహెచ్ఎస్ సీతానగరం, జెడ్పీహెచ్ఎస్ ఎమ్మార్‌నగరం, జెడ్పీహెచ్ఎస్ నర్సిపురం
చదరంగం: జెడ్పీహెచ్ఎస్ నర్సిపురం
అథ్లెటిక్స్: జెడ్పీహెచ్ఎస్ సీతానగరం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాలకొండ, జెడ్పీహెచ్ఎస్ గాదెలవలస
ఫెన్సింగ్: ఆర్‌సీఎం పాఠశాల పార్వతీపురం, ఏకే అకాడమీ పార్వతీపురం కబడ్డీ: జీడీసీ గ్రౌండ్ పాలకొండ
త్వైకాండో: జీజే కాలేజీ పార్వతీపురం, సాయిరాంనగర్ పార్వతీపురం, ఎంపీయూపీ జగన్నాథపురం, ఎంపీయూపీ కృష్ణపల్లి, జెడ్పీహెచ్ఎస్ నర్సిపురం, కిశోర్‌చంద్రదేవ్ పాఠశాల కురుపాం
ఆర్చరీ: మినీ స్టేడియం సీతానగరం, బాలికల ఉన్నత పాఠశాల పార్వతీపురం
వాలీబాల్: జీడీసీ గ్రౌండ్ పాలకొండ, హెచ్ఎస్ గ్రౌండ్స్ దోనుబాయి, జెడ్పీహెచ్ఎస్ పార్వతీపురం, జెడ్పీహెచ్ఎస్ తోటపల్లి



కబడ్డీలో విద్యార్థినులు (ఫైల్)

యోగా: రిషి యోగా సెంటర్ పాలకొండ, జీడీసీ గ్రౌండ్ పాలకొండ, ప్రభుత్వ బాలుర పాఠశాల పార్వతీపురం, సూర్య యోగా సెంటర్ పార్వతీపురం, కేఎస్ యోగా సెంటర్ పార్వతీపురం, జెడ్పీహెచ్ఎస్ ఎమ్మార్‌నగరం
క్రికెట్: జెడ్పీహెచ్ఎస్ సీతానగరం

ప్రతిభ కనబరిచిన వారికి గుర్తింపు

శిక్షణ శిబిరాల్లో ప్రతిభ కనబరచిన వారికి గుర్తింపు ఉంటుంది. సోమవారం నుంచి వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ నుంచి ఆదేశాలు అందాయి. అందులో భాగంగా క్రీడల నిర్వహణకు అవసరమైన మెటీరియల్ కూడా రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ నుంచి వచ్చింది. శిక్షకులకు అందిస్తాం. శిక్షణ ముగిసిన అనంతరం శిక్షణార్థులకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేస్తాం. – ఎస్ వెంకటేశ్వరరావు, జిల్లా చీఫ్ కోచ్, పార్వతీపురం మన్యం

సద్వినియోగం చేసుకోవాలి

విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఉచితంగా 50 ప్రాంతాల్లో క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు చేతుల మీదుగా సోమవారం ప్రారంభించనున్నాం. క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు రూ.3.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, శిబిరాల ప్రారంభోత్సవం, ముగింపు ఉత్సవాలకు ఈ నిధులు వినియోగించాల్సి ఉంటుంది.

-బి.రామ్‌గోపాల్, సెట్విజ్ సీఈఓ, విజయనగరం

నేటి నుంచి పైడితల్లి అమ్మవారి పండుగ

- సిరిమానోత్సవం రేపు
- ఏర్పాట్లు పూర్తి చేసిన గ్రామ పెద్దలు



శ్రీ పైడితల్లి అమ్మవారు

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామ దేవత శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. 14ఏళ్ల క్రితం గ్రామంలో అమ్మవారి పండుగను జరుపుకున్నారు. మళ్లీ ఇప్పుడు పైడితల్లి అమ్మవారి పండుగను జరిపేందుకు గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు నిర్ణయించారు. శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగను ఆమిటితో పాటు సింగిరెడ్డివలస, సీతారాంపురం, బొంగుపేట గ్రామాల ప్రజలు జరుపుకోనున్నారు. ఆయా గ్రామాల్లో కొద్ది రోజులుగా అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. పైడితల్లి అమ్మవారి పండుగలో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపోత్సవాన్ని జరిపేందు కు ఏర్పాట్లు చేశారు. గ్రామానికి సమీపంలో ఉన్న శ్రీపైడితల్లి అమ్మవారి ఆలయానికి గ్రామానికి చెందిన మహిళలు ప్రతీరోజూ వెళ్లి పూజలు చేస్తున్నారు. అమ్మవారి పండుగకు వేల సంఖ్య లో భక్తులు హాజరు కానుండడంతో గ్రామ పెద్దలు, ప్రజలు అన్ని ఏర్పాట్లు చేశారు.

వైభవంగా శ్రీవారి సన్నిధిలో యాగశాల శుద్ధి

సీతంపేట:

సీతంపేటలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా మహా సంప్రోక్షణ ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం అంకురార్పణతో ఆరంభమైన కార్యక్రమం ఐదు రోజుల పాటు జరగనుంది. కార్యక్రమాల్లో భాగంగా పంచఅగ్నిహిక దీక్ష, మహా సంప్రోక్షణ విగ్రహా ప్రతిష్ఠ చేయనున్నారు. మే నెల 4 వ తేదీ వరకు స్వామివారికి వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య పూజలు జరగనున్నాయి. ఆదివారం శ్రీవారి సన్నిధిలో యాగశాల శుద్ధి పూజలు చేశారు. శాస్త్రోక్తంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితుల ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. పంచగవ్య ప్రాసన, వాస్తుహోమం, రక్షా బంధనం, అగ్ని ప్రతిష్ఠ, కుంభ స్థాపన, కుంబారాధన, విశేష హోమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కనులార చూసి ఆనందించారు. డిప్యూటీ ఈఓలు గుణభూషణరెడ్డి, శివప్రసాద్, వెంకటయ్య, ఈఈ సుధాకర్, డీఈ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తులకు హారతి ఇస్తున్న అర్చకులు



యాగశాలలో ప్రత్యేక హోమం జరుపుతున్న అర్చకులు